ప్రజాశక్తి
సోమవారం 10 ఏప్రిల్ 2023



పండ్లతోటల పెంపకానికి ప్రోత్సాహం

◆ప్రకృతి విపత్తు నష్టాలపై ప్రభుత్వానికి నివేదికలు
◆శ్రీ సత్యసాయి జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్



చంద్రశేఖర్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పండ్ల తోటల పెంపకం గత పది సంవత్సరాల నుంచి రైతులు పెద్ద ఎత్తున ఆసక్తి చూపుతున్నారని, వీరికి ఉద్యానవన శాఖ ద్వారా మరింత ప్రోత్సాహం అందిస్తున్నాం. గతంలో తీవ్ర వర్షాభావంతో పండ్ల తోటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. నాలుగు సంవత్సరాల నుంచి జిల్లాలో అత్యధికంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు పండ్ల తోటల పెంపకంపై ఆసక్తి చూపిస్తున్నారు. దీనికి తోడు ప్రభుత్వం కూడా ఎన్నో ప్రోత్సాహకాలను అందిస్తోంది. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలి అని శ్రీ సత్యసాయి జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్ పేర్కొన్నారు. జిల్లాలో ఉద్యానవన శాఖ ద్వారా రైతులకు అందిస్తున్న ప్రోత్సాహంపై ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

ప్ర: పండ్ల తోటలసాగుతో రైతులకు ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయి.?

ఎడి : అతివష్టి అనావష్టి చేత ఇటీవల చాలామంది రైతులు సాధారణ పంటల సాగుపై ఆసక్తి చూపడం లేదు. ఈ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయంగా పండ్లతోటల పెంపకంపై మక్కువ చూపుతున్నారు. రైతులకు ప్రభుత్వం ఎన్నో ప్రోత్సాహకాలు ఇస్తూ పండ్ల తోటల పెంపకాన్ని చేపడుతోంది. ఉపాధి హామీ పథకం ద్వారా పండ్లతోటలు సాగు చేసుకోవచ్చు. దీని ద్వారా రైతులకు పెట్టుబడి తగ్గుతుంది. వీటి సంరక్షణకు కూడా ప్రభుత్వం చేయూతనందిస్తోంది. మొదటి దశలో గుంతలు తీయడానికి మొక్కలు నాటడానికి మూడు సంవత్సరాల సంరక్షణకు కోసం రైతులకు ఉపాధి హామీ పథకం ద్వారా బిల్లులు మంజూరు చేస్తోంది.

ప్ర: పండ్లతోటల పెంపకం కోసం రైతులకు ప్రభుత్వం ఎలాంటి ప్రోత్సాహకాలు అందిస్తోంది.?

ఎడి : పండ్ల తోటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం అనేక ప్రోత్సాహాలను అందిస్తోంది. వాటిలో బోరు బావుల తవ్వకంకు అవకాశం కల్పిస్తోంది. రైతులకు డ్రైలాండ్, హార్టికల్చర్, పథకం ద్వారా మామిడి మొక్కలు సాగు చేస్తే మొక్కలకు నీటిని అందించడానికి ఎరువులు తదితర వాటి కోసం మూడేళ్ల పాటు ఎకరాకు 13,193 రాయితీ అందిస్తోంది. బోరు బావులు ఉన్న రైతులకు చీనీ మొక్కలు సాగు చేసుకుంటే 1,07,459 రూపాయలు రాయితీ అందిస్తోంది. జామ, సపోటా, కొబ్బరి, సీతాఫలం, తదితర పండ్ల తోటల సాగుకు రాయితీలు విరివిగా ప్రభుత్వం అందిస్తోంది.



ప్ర: పండ్ల తోటల రైతులకు ఏఏ పంటలకు ఎంత నష్టపరిహారం అందిస్తారు.?

ఎడి: సత్యసాయి జిల్లా వ్యాప్తంగా 2022 సంవత్సరంలో కురిసిన వర్షాలకు 255 హెక్టార్లలో పండ్లతోటలు నష్టం వాటిల్లింది. 316 మంది రైతులు నష్టపోయారు. అత్యధికంగా కాయగూరలు పంటలైన టమోటాకు భారీ నష్టం వాటిల్లింది. జిల్లా వ్యాప్తంగా 110 ఎకరాల్లో టమోటా పంట నాశనమైంది. నష్టపరిహారం బొప్పాయికి ఎకరాకు రూ.15వేలు, అరటికి రూ.25 వేలు, మామిడికి ఎకరాకు రూ.20వేలు, నారింజ, దానిమ్మ, చీనీ, కాయగూరల పంటలకు రూ.15వేలు, కొత్తిమీర పంటకు రూ.7200 చొప్పున ఎకరాకు నష్టపరిహారం రైతులకు అందిస్తున్నాం.

ప్ర: పండ్ల తోటల రైతులకు నష్ట నివారణ చర్యలేవి.?

ఎడి : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సత్యసాయి జిల్లాలో ఉద్యానవన పంటలకు అపార నష్టం వాటిల్లింది. ఉద్యాన పంటలతో పాటు కాయగూరలు, పండ్ల తోటలు సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు ప్రాథమిక అంచనా ప్రకారం పంట నష్టం నివేదికను తయారుచేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లాం. జిల్లాలో 33 శాతం పంట నష్ట పరిహారం అందించడానికి ప్రతిపాదనలు పంపాం.

ప్ర:గత నాలుగు సంవత్సరాల నుంచి నష్టపోయిన రైతులకు ఏ విధంగా ఆదుకుంటున్నారు.?

ఎడి : పంట నష్టాన్ని అంచనా వేసి నివేదికలు ప్రతి సంవత్సరం ప్రభుత్వానికి అందిస్తున్నాం. గత నాలుగు సంవత్సరాల నుంచి ఉద్యానవన పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాం. క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించి నివేదికలు ప్రతి సంవత్సరం అందజేస్తున్నాం. దాని ప్రకారం ఇంకా రావాల్సిన వారికి త్వరలో నష్టపరిహారం అందుతుంది. వీటికి తోడు డ్రిప్పు పరికరాలు, స్ప్రింక్లర్లు, స్ప్రేయర్లు, పైపులు సబ్సిడీ ధరలకు అందిస్తున్నాం.



లోకేశా... సామాజిక న్యాయం ఇదేనా..?

◆ఎస్సీ మహిళ బండారు శ్రావణికి అడుగడుగునా అవమానాలు
◆యువగళం పాదయాత్రలో మాట్లాడే అవకాశం ఇవ్వని వైనం
◆నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్నా ప్రాధాన్యత కరువు
◆టిడిపి తీరుపై బండారు శ్రావణి మద్దతుదారులు, దళిత సంఘాల నుంచి వ్యతిరేకత

'వైసిపి అధికారంలోకి వచ్చాక దళితులు, మహిళలపై దాడులు పెరిగాయని యువగళం పాదయాత్రలో లోకేష్ ప్రతి ప్రసంగంలోనూ ప్రస్తావిస్తున్నారు. తాము ఆ వర్గాలకు అండగా నిలుస్తామని చెబుతున్నారు. అయితే ఆచరణలో చూస్తే అది కనిపించడం లేదు. తన సొంత పార్టీలో ఒక నియోజకవర్గం ఎస్సీ, మహిళను ఇద్దరు నేతలు బాహాటంగానే అవమానిస్తూ వస్తున్నా లోకేష్ చూసీచూడనట్టు ఉండటం అనేక విమర్శలకు తావిస్తోంది. ఆ ఇద్దరు నేతలను కనీసం హెచ్చరించే ప్రయత్నం చేయకపోవడం శోచనీయం. పాదయాత్ర ప్రారంభించినప్పటి నుంచి ప్రతి నియోజకవర్గంలోనూ నియోజకవర్గ ఇన్‌ఛార్జిలకు మాట్లాడే అవకాశం కల్పిస్తూ వస్తున్నారు. కానీ ఎస్సీ రిజర్వు నియోజకవర్గమైన శింగనమలకు వచ్చే సరికి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగానున్న బండారు శ్రావణికి ఆ అవకాశం కల్పించకపోవడం రాజకీయవర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, శింగనమల

లోకేష్ యువగళం పాదయాత్ర శుక్రవారం రోజు శింగనమల నియోజకర్గంలోకి ప్రవేశించింది. అదే రోజు యాత్ర ముగిసిన తరువాత బండారు శ్రావణి, ఆయన తండ్రి రవికుమార్‌లు లోకేష్‌ను కలిసేందుకు విడిది వద్దకు వెళ్లిన సమయంలో టూమెన్ కమిటీ సభ్యులకు సంబంధించిన ఒక వ్యక్తి వారిని కామెంట్ చేసినట్టు సమాచారం. దీనిపై బండారు శ్రావణి ప్రతిస్పందించడంతో ఏకంగా బూతుపురణాన్ని సదరు నాయకుడి సోదరుడు అందుకోవడమే కాకుండా శ్రావణి తండ్రి రవికుమార్‌పై దాడికి సైతం యత్నించినట్టు సమాచారం. దీంతో ఆయన ఆసుపత్రిలో చేరారు. ఆ మరుసటి రోజు నుంచి సాగు తున్న యాత్రలోనూ బండారు శ్రావణికి అడ్డంకులు తప్పడం లేదన్న చర్చ టిడిపి వర్గాల్లోనే సాగుతోంది. లోకేష్‌తోపాటు నడుస్తున్న సమయంలో శ్రావణిని పక్కకు నెట్టేస్తున్న దృశ్యాలు వీడియోలో రావడం దుమారం రేపుతోంది. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా శింగనమల ఎస్సీ రిజర్వు నియోజకవర్గంలోనే ఇన్‌ఛార్జి ఉన్నప్పటికీ ఇద్దరు సభ్యులతో టూమెన్ కమిటీ వేయడం, వారి ద్వారానే నియోజకవర్గ కార్యక్రమాలు నిర్వహించే విధంగా అధి నాయకత్వం చూడటం పట్ల ముందునుంచి ఆ తరగతుల్లో అంసతృప్తి ఉంది. ఇక పాదయాత్ర సందర్భంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో కదిరి, పుట్టపర్తి, పెనుకొండ, రాప్తాడు, ధర్మవరం, అనంతపురం, ఉరవకొండ అన్ని నియోజకవర్గాల్లోనూ నియోజకవర్గ ఇన్‌ఛార్జులను సభల్లో లోకేష్ మాట్లాడించారు. పెను కొండలో అయితే ఇన్‌ఛార్జి బికెతో పాటు సబితకూ అవకాశమిచ్చారు. శింగనమల నియోజకవర్గంలో వచ్చే సరికి గార్లెదిన్నె సభలో ఇన్‌ఛార్జి స్థానంలో అనంతపురం పార్లమెంట్ అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు ప్రసంగించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న బండారు శ్రావణికి అవకాశం కల్పించకపోవడం చర్చనీయాంశం మారింది. ఒకవైపు దళితులు, మహిళలకు అవకాశం ఇస్తూ తాము అండగా ఉంటామని ప్రకటనలు చేస్తూ, ఆచరణలో ఏమి చేస్తున్నారన్న ప్రశ్నలు దళిత సంఘాల నుంచి పెద్ద ఎత్తున వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనలపై ఇప్పటికే పిసిసి కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు డాక్టర్ సాకే శైలజనాథ్ సైతం ఖండించారు. ఇతర దళిత సంఘాలు కూడా టిడిపిలో జరుగుతున్న తీరును తప్పుబడుతున్నాయి. మరి దీనిపై లోకేష్, టిడిపి అధినాయకత్వం ఎలా స్పందిస్తోందో చూడాల్సి ఉంది.

పేదల పెన్నిధి ఫాదర్‌ఫెర్రర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజల జీవితాల్లో వెలుగు నింపి పేదల పెన్నిధిగా నిలిచిన మహోన్నత వ్యకి విన్సెంట్ ఫాదర్‌ఫెర్రర్ అని పలువురు కొనియాడారు. ఫాదర్‌ఫెర్రర్ 103వ జయంతి వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. అనంతపురం ఆర్డీటీ కార్యాలయంతో పాటు, బత్తలపల్లి ఫెర్రర్ సమాధి వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామీణ ప్రజల అభివృద్ధి, వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన నిమిత్తం 1969లో ఫాదర్ ఫెర్రర్ అనంతపురం జిల్లాలో రూరల్ డెవలెప్‌మెంట్ ట్రస్టును స్థాపించారని చెప్పారు. ఆయన జీవితాంతం పేదల అభ్యున్నతి కోసం శ్రమించారని చెప్పారు. 103వ జయంతి కార్యక్రమాల్లో స్పెయిన్ కాన్సుల్ జనరల్ ఫెర్నాండో హెరాడియా నోగుర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కుందుర్పిలో జరిగిన కార్యక్రమంలో ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛూ ఫెర్రర్, బత్తలపల్లి మండలం ముష్టూరు గ్రామంలో ఆర్డీటీ ఉమెన్ ఎంపవర్‌మెంట్ డైరెక్టర్ విశాల్ ఫెర్రర్ పాల్గొన్నారు. అనంతపురం కలెక్టరేట్ ఎదుట అవే సంస్థ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను నిర్వహించారు. ఆవే వ్యవస్థాపకులు వైకుంఠం ప్రభాకర్ చౌదరి ఫెర్ర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు.



అనంతపురం కలెక్టరేట్ ఎదురుగా ఫాదర్‌ఫెర్రర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి, తదితరులు

అందరినీ కలుసుకుంటూ..సమస్యలు వింటూ..

శింగనమలలో 65వ రోజు లోకేష్ యువగళం పాదయాత్ర

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వివిధ తరగతుల వారిని కలుసుకుంటూ... వారి సమస్యలు తెలుసుకుంటూ నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఆదివారం 65వ రోజు కొనసాగింది. ఆదివారం ఉదయం జంబులదిన్నె వద్ద ప్రారంభమైన పాదయాత్ర వెస్టు నరసాపురం, చిన్నజలాలపురం, శింగనమల మీదుగా సోదనపల్లి క్రాస్ వరకు పాదయత్ర సాగింది. ఈ సందర్భంగా పలుచోట్ల వివిధ తరగతుల వారిని కలుసుకుని లోకేష్ మాట్లాడారు. ఉదయం ప్రయివేటు ఆసుపత్రుల డాక్టర్లతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 20,30 పడకలున్న ఆసుపత్రులకు ఆరోగ్యశ్రీ వర్తింపజేయాలని ప్రయివేటు డాక్టర్లు కోరారు. దంత సమస్యలకు ఆరోగ్యశ్రీ పరిధిలోకి తేవాలని కోరారు. దీనికి లోకేష్ సానుకూలంగా స్పందించారు. అనంతరం పాదయాత్ర వెస్టునరసాపురం వద్దకు చేరుకుంది. అక్కడ లోకేష్ పొలంలోకి దిగి కౌలు రైతులతో మాట్లాడారు. వేరుశనగ పంట సాగు చేస్తే పెట్టుబడి కూడా చేతికి రాలేదని రైతులు తెలిపారు. గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. విద్యుత్ మోటర్లకు మీటర్లు పెడుతామంటున్నారు... ఇప్పటికే వ్యవసాయం భారమైన సమయంలో ఇది అమలు జరిగితే మరింత భారం పడుతుందని మహిళా రైతు లక్ష్మీదేవి లోకేశ్‌కు చెప్పారు. మరో తోటలో బెండ రైతు నారాయణరెడ్డితో మాట్లాడారు. రూ.70 వేలు పెట్టుబడి అయ్యిందని, అది కూడా వచ్చే పరిస్థితి లేదని నారాయణరెడ్డి తెలిపారు. నకిలీ విత్తనాలను అరికట్టి గిట్టుబాటు ధర కల్పించాలని ఆయన లోకేశ్‌ను కోరారు. వాల్మీకులను ఎస్టీల జాబితాలో చేర్చాలని వాల్మీకి సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. దీనికి లోకేశ్ స్పందిస్తూ టిడిపి హయంలో దీనిపై వేసిన సత్యపాల్ కమిటీ నివేదిక వచ్చిందని, ఈ రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు దానిని బయటపెట్టలేదని చెప్పారు. తాము అధికారంలోకి వస్తే కమిటీ నివేదికను పరిశీలించి తగిన న్యాయం చేస్తామని హామీనిచ్చారు. విశ్వ బ్రాహ్మణులు ఆయన్ను కలిసి వారి సమస్యలను విన్నవించారు. వడ్రంగి పనిచేసే విశ్వ బ్రాహ్మణులకు ప్రభుత్వం వైపు నుంచి తోడ్పాటు అందివ్వాలని కోరారు. తాము అధికారంలోకి వస్తే విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తామని లోకేష్ హామీనిచ్చారు. అనంతరం కురబ సంఘం నాయకులు, గొర్రెల కాపరులు కలసి వారి సమస్యలను తెలియజేశారు. గొర్రెల పెంపకానికి పది ఎకరాల భూమిని గ్రామానికి కేటాయించాలని, వంద శాతం సబ్సిడీతో గొర్రెల షెడ్డు ఇవ్వాలని, కురబ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని కోరారు. తాము అధికారంలోకి వచ్చాక కురుబలకు తగిన న్యాయం చేస్తామని హామీనిచ్చారు. వెస్టు నరసాపురం, చిన్నజలాల పురం గ్రామస్తులు వారి గ్రామాలకు పిఎబిఆర్ నీటిని అందవ్వాలని కోరారు. ఇలా అన్ని వర్గాల ప్రజలను పలుకరిస్తూ లోకేష్ పాదయాత్ర సాగింది. శింగనమల వద్ద చెరువుల్లో బోట్లలో స్వాగతం బ్యానర్లు పట్టుకుని టిడిపి నాయకులు స్వాగతం పలికారు. అదే విధంగా శింగనమల రామాలయం వద్ద క్రేన్ సహాయంతో గజమాలతో స్వాగతం పలికారు. ఇలా పెద్దఎత్తున లోకేశ్ పాదయాత్రకు స్వాగతం లభించింది. ఈ కార్యక్రమంలో శింగనమల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణి, టూమెన్ కమిటీ సభ్యులు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు, టిడిపి ఎస్సీ సెల్ నాయకులు ఎంఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.



యువగళం పాదయాత్రలో వెస్టు నరసాపురం వద్ద బెండ రైతులతో మాట్లాడుతున్న నారా లోకేష్

బిజెపి పాలనలో ప్రమాదంలో ప్రజాస్వామ్యం

◆ప్రజా వ్యతిరేక, మతోన్మాద విధానాలపై ప్రచారభేరి ◆సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

బిజెపి పాలనలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. సిపిఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని ఆదివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ బిజెపి ఒక వైపు మతోన్మాద ఘర్షణలు, మరో వైపు అదానీ, అంబానీ లాంటి అతి సంపన్నులకు దేశ సంపదను దోచి పెడుతోందన్నారు. ఈ మతోన్మాద, నిరంకుశ విధానాలను ప్రజలకు వివరించేందుకు సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 30వ తేదీ వరకు సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ప్రచారభేరి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి, ఐక్య పరచాలని సిపిఎం కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రజల సంపదగా ఉన్న బ్యాంకుల్ని, ప్రభుత్వ రంగ పరిశ్రమల్ని, ఓడరేవుల్ని, అఖరికి వ్యవసాయాన్ని సైతం కార్పొరేట్లకు మోడీ ప్రభుత్వం ధారాదత్తం చేస్తోందన్నారు. దేశంలో అడవులు, భూములను, విద్యుత్ ప్రాజెక్టులు, గనులను అదానీ లాంటి కార్పొరేట్లకు ఆక్రమంగా కట్టబెడు తోందన్నారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి పేదల నడ్డి విరుస్తోందన్నారు. కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. ఉపాధి హామీ పథకాన్ని సైతం మోడీ ప్రభుత్వం అటకెక్కించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యేక హోదా, పోలవరం నిధులు, రాజధాని నిర్మాణం, రైల్వే జోన్, రాయలసీమ ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వకుండా కేంద్రం మోసం చేసిందన్నారు. బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు సిపిఎం శ్రేణులు ఈ నెల 14 నుంచి 30వ తేదీ వరకు ప్రజల వద్దకెళ్లి వినాశకర ఆర్థిక, మతత్వ ప్రమాదాన్ని ప్రజలకు వివరించాలన్నారు. కేరళలో వామపక్ష ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రత్యామ్నాయ ప్రజా అనుకూల విధానాల సాధన కోసం జరిగ ఉద్యమాలకు ప్రజలను సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, నాయకులు ఓ.నల్లప్ప, ఎం.బాలరంగయ్య, ఎస్.నాగేంద్ర, బి.శ్రీనివాసులు, ఎం.కృష్ణమూర్తి, వి.రామిరెడ్డి, ఆర్‌వి.నాయుడు, రామాంజనేయులు, సూర్యచంద్ర, నాగమణి, నిర్మల, భాస్కర్, అచ్యుత్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

'కాలవ' సవాల్ స్వీకరణకు సిద్ధం : విప్ కాపు

ప్రజాశక్తి-రాయదుర్గం

మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు తనపై విసిరిన సవాలు స్వీకరణకు తాను సిద్ధంగా ఉన్నానని రాయదుర్గం ఎమ్మెల్యే, విప్ కాపు రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం కాలవ శ్రీనివాసులు విసిరిన సవాల్ కు ఆదివారం ఒక ప్రకటన ద్వారా కాపు స్పందించారు. కాలవ సూచించినట్లు మలపనగుడి గ్రామం అయినా.. నేమకల్లు అయినా.. రాయదుర్గం నియోజకవర్గం లోని ఏ గ్రామంలోనైనా కాలవతో పాటు తానూ గడప గడపకూ వెళ్లి ప్రజలకు ఎవరి వల్ల, ఏ ప్రభుత్వం వల్ల అధిక లబ్ధి చేకూరిందో తేల్చుకోవడానికి తాను సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. తాను పోలీసులను కాని గన్‌మెన్‌లను కాని వెంటబెట్టుకు రానని, అయితే వార్డు వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, తమ పార్టీ కార్యకర్తలతో గడప గడపకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. శ్రీనివాసులు కూడా తమ జన్మభూమి కమిటీ సభ్యులతో గడప గడపకు రావాలన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో ప్రజలకు ఎవరికి ఎంత లబ్ధి చేకూరిందో తెలుపుతూ జాబితాతో సిద్ధంగా రావాలని పిలుపునిచ్చారు. గతంలో తాను పలుమార్లు ఇదే విషయాన్ని సవాలు చేసినప్పటికీ ఏనాడు స్పందించని కాలవ శ్రీనివాసులు శనివారం మీడియా ద్వారా తనకు చాలెంజ్ చేసిన విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. అందుకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు. కాలవ కూడా సిద్ధంగా ఉంటే ఎవరి హయాంలో అధిక లబ్ధి చేకూరిందో ప్రజలకు తెలియజేద్దామన్నారు. జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైసిపి ప్రభుత్వ పాలనలో ప్రజలకు అధిక లబ్ధి చేకూరివుంటే తమ పార్టీని ఆదరించమని ప్రజలను తాను కోరుతానన్నారు. ఐదేళ్ల టిడిపి పాలనలో కంటే వైసిపి పాలనలో అధిక లబ్ధి చేకూరివుంటే వైసిపినే ఆదరించమని ప్రజలకు కాలవ శ్రీనివాసులు చెబుతారా అని ప్రశ్నించారు. కాలవ శ్రీనివాసులు తనతో పాటు గడప గడపకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆశిస్తున్నట్లు కాపు రామచంద్రారెడ్డి తెలిపారు.



సిపిఎం, ఆవాజ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సిపిఎం ఒకటవ నగర కమిటీ, ఆవాజ్ ఆధ్వర్యంలో రంజాన్ పండగ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లిములకు ఇఫ్తార్ విందును ఇచ్చారు. ఆదివారం సాయంత్రం ఇందిరానగర్‌లోని సిపిఎం కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇఫ్తార్ విందుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ జె.గౌస్‌మోహిద్దీన్, అడ్వకేట్ రసూల్, 49వ డివిజన్ కార్పొరేటర్ ముని శేఖర్, మైనారిటీ నాయకులు తాజ్, జాకీర్, నిజాం, మేవ ఫక్రుద్దీన్, మైనారిటీ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న పాల్గొన్న సిపిఎం, ఆవాజ్ నాయకులు, ముస్లిములు



మార్కెట్ యార్డు చైర్మన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

చలివేంద్రం ప్రారంభం

అనంతపురం : అనంతపురం నగరంలోని లలిత కళాపరిషత్ ఎదురుగా కారు ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సిపిఎం ఒకటవ డివిజన్ కార్యదర్శి వి.రామిరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ నగరంలో వివిధ పనుల నిమిత్తం సుదూర ప్రాంతాలు నుంచి వచ్చే ప్రజల దాహార్తి తీర్చడం కోసం సిఐటియు అనుబంధ కారు డ్రైవర్స్, ఓనర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు లతీఫ్, కారు డ్రైవర్లు, ఓనర్లు పాల్గొన్నారు.

రెండురోజులు నీటి సరఫరాకు అంతరాయం

రాయదుర్గం : రాయదుర్గం పట్టణానికి తాగునీరు సరఫరా చేసే ప్రధాన పంపింగ్ పైప్‌లైన్ ఆదివారం ఉదయం కనేకల్ క్రాస్ వద్ద లీకేజీకి గురి అయినట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. తమ దృష్టికి వచ్చిన వెంటనే మరమ్మతులు చేపట్టామని చెప్పారు. దీనివల్ల రెండు రోజులపాటు రాయదుర్గం పట్టణంలో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. పట్టణ ప్రజలు సహకరించాలని కమిషనర్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

వైసిపి ఎంపిటిసి టిడిపిలో చేరిక

బొమ్మనహాల్ : బొమ్మనహాల్ మండలం నేమకల్లు గ్రామానికి చెందిన ఎంపిటిసి చిక్కన్న టిడిపి తీర్థం పుచుకున్నారు. ఆదివారం శింగనమల మండలంలో నారా లోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంగా మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో చిక్కన్న టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా చిక్కన్న మాట్లాడుతూ.. వైసిపిలో కింది స్థాయి నాయకులకు ప్రధాన్యత లేదన్నారు. ఒకరిద్దరికి తప్ప ఎవరికీ ఎమ్మెల్యేతో మాట్లాడే చనువులేదన్నారు. మండలంలో ఎలాంటి అభివృద్ధి పనులూ చేపట్టలేకపోతున్నామని తెలిపారు.

పరీక్ష పేపర్ లీకులను అరికట్టాలి

కళ్యాణదుర్గం : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో పదవ తరగతి పరీక్ష పేపర్ లీకేజీలను అరికట్టాలని హరిత దివ్యాంగ సేవాసమతి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని గురుకుల పాఠశాల ఆవరణలో ఆ సంఘం సభ్యులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష పేపర్లు లీకు కావడంతో విద్యార్థుల భవిష్యత్తు అంధకారం అవుతోందన్నారు. వారు మానసిక ఒత్తిళ్లకు గురై ఆత్మహత్యలు చేసుకునే ప్రమాదం ఉందన్నారు. వెంటనే ప్రభుత్వాలు పేపర్లు లీకేజీలు కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాజశేఖర్, భాస్కర్‌నాయక్, వెంకటేష్‌నాయక్, బాబు నాయక్, చంద్రశేఖర్, రాజశేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్తు'

బుక్కరాయసముద్రం : మండలంలోని ఒడియంపేట గ్రామంలో ఎంపిపి సునీత ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వాటి ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. ఇళ్లకు స్టిక్కర్లను అతికించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు అనంత వెంకటరెడ్డి, బుల్లి నారాయణస్వామి, గృహ సారథులు గంగాధర్, జవ్వాది సావిత్రి, వాలంటీర్ అనురాధ, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న దృశ్యం

ఆసుపత్రి వద్ద అన్నదానం

అనంతపురం : నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు వారి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ట్రస్టు చైర్ పర్సన్ డాక్టర్ నిర్మల మురళి పేదలకు అన్నదానం చేశారు. ట్రస్ట్ సభ్యులు టుంకూర్ వాస్తవ్యులు బద్రీనాథ్ పుట్టినరోజు సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించినట్లు ఆమె తెలిపారు. మన కుటుంబ సభ్యుల శుభకార్యాల సందర్భంగా పేదల ఆకలి తీర్చడం సంతోషంగా ఉంటుందన్నారు. పుట్టినరోజున పేదలకు సహాయం చేసే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, కిష్టప్ప, పాపయ్య, సుబ్బారావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

అనంతపురం : రంజాన్ పండుగను పురస్కరించుకుని నగరంలోని గఫూర్ కాలనీలోని కెఎస్‌ఆర్ గఫూర్ హాస్పిటల్ డాక్టరు అబ్దుల్ రజాక్ గఫూర్ కుటుంభ సభ్యులు 200 పేద ముస్లిం కుటుంబాలకు ఆదివారం నిత్యావసర సరుకులను పంపణి చేశారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీం, మార్కెట్ యార్డు చైర్మన్ ఫయాజ్ బాషా, డాక్టర్ ఆర్షద్ ఆయూబ్ హాజరయ్యారు.



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనంత

పేదల జీవితాల్లో వెలుగు నింపిన ఫెర్రర్

అవే సంస్థ అధ్యక్షుడు వైకుంఠం ప్రభాకర్ చౌదరి

ప్రజాశక్తి-నంతపురం కలెక్టరేట్

మరణం తర్వాత కూడా జీవించి ఉన్న వ్యక్తి ఫాదర విన్సెంట్ ఫెర్రర్ అని, ఎన్నో కష్టనష్టాలు, వ్యయ ప్రయాసల కోర్చి స్పందించు సాయమందించు అన్న నినాదంతో జిల్లాలో ఆర్‌డిటి సంస్థలు స్థాపించిన మహోన్నత వ్యక్తి అని అవే సంస్థ అధ్యక్షుడు వైకుంఠం ప్రభాకర్ చౌదరి కొనియాడారు. ఆదివారం విన్సెంట్ ఫాదర్ ఫెర్రర్ జయంతి పురస్కరించుకొని నగరంలోని కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి, ఆర్ డిటి సంస్థ ప్రతినిధి విశాల ఫెర్రర్, డైరెక్టర్ తిప్పేస్వామి, కుల సంఘాల నాయకులతో కలిసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఆయన కృషికి కతజ్ఞతగా అవే సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా ఆయన విగ్రహం ఏర్పాటు చేశామన్నారు.

మరింత విస్తత పరుస్తాం : విశాల ఫెర్రర్

ఆర్‌డిటి సేవలను మరింత విస్తత పరుస్తామని ఆ సంస్థ ప్రతినిధి విశాలా ఫెర్రర్ పేర్కొన్నారు. ఫాదర్ ఫెర్రర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం ఆమె మాట్లాడుతూ స్పందించి సాయం అందించు కార్యక్రమం ద్వారా జిల్లాలో ఎంతోమందికి సేవలందిస్తున్నామన్నారు. మరిన్ని సేవలు అందించడానికి ఆర్ డిటి సంస్థ ముందుంటుందని తెలిపారు. కార్యక్రమంలో అవే సంస్థ జిల్లా అధ్యక్షులు బంగి నాగ, కేపీ నారాయణస్వామి, బిఎస్ దాస్, జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధులు సరిపూటి రమణ, నారాయణస్వామి యాదవ్, నగర మహిళా అధ్యక్షురాలు విజయశ్రీరెడ్డి, రాష్ట్ర యాదవ కురవ కోఆర్డినేటర్ శివబాల, రాష్ట్ర గాండ్ల సాధికార అధ్యక్షురాలు విశాలాక్షి, మాజీ కార్పొరేటర్ రాధాదేవి, ఉమామహేష్, జిల్లా మహిళా అధికారనిధి వసుంధర, రాష్ట్ర నాయకులు కూచిహరి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో

అనంతపురం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఫెర్రర్ జయంతి వేడుకలు జరిగాయి. గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు ఉమా మోహన్‌రెడ్డి ఫెర్రర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉప గ్రంథాలయ అధికారిని వి.సుబ్బరత్నమ్మ, ఇంతియాజ్, బాషా, కావేరి, ఇతర సిబ్బంది, విద్యార్థులు, పాల్గొన్నారు.



ఉరవకొండలో..

ఉరవకొండ : ఆర్‌డిటి వ్యవస్థాపకులు విన్సెంట్ ఫాదర్ ఫెర్రర్ అలుపెరిగిన సమాజ నిస్వార్థ సేవకుడని ఉరవకొండ ఎస్‌టిఎల్ వసంత పేర్కొన్నారు. విడపనకల్ మండల కేంద్రంలోని ఆర్‌డిటి పాఠశాలలో విన్సెంట్ ఫాదర్ ఫెర్రర్ 103వ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్పెయిన్ దేశంలో పుట్టి అనంత జిల్లా ప్రజలకు విద్య, వైద్య, ఆరోగ్య రంగాలతో పాటు గృహాలు కల్పించడంలో శక్తి వంచన లేకుండా ఎంతగానో కషి చేశాడని కొనియాడారు. కుల, మత, ప్రాంత, జాతి విభేదాలు లేకుండా మనుషులంతా ఒక్కటే అనే నినాదంతో బడుగు బలహీన వర్గాల వారిని అభివృద్ధి పథంలో నడిపించేందుకు తన జీవితకాలం ప్రయాసపడిన గొప్ప సంఘసంస్కర్త అన్నారు. ఫాదర్ ఫెర్రర్ చూపిన మార్గంలో నేటి యువత అభివృద్ధిని సాధించే విధంగా ముందుకెళ్లి వారి బంగారు భవిష్యతకు బాటలు వేసుకోవాలని సూచించారు. అనంతరం ఫెర్రర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిటి సిబ్బంది దాదా, వెంకటలక్ష్మి, కమిటీ మెంబర్లు ఎంబి చిన్న రాయుడు, సరస్వతి, నాగలక్ష్మి, రామాంజనమ్మ, ఆర్‌డిటి టీచర్లు సుంకన్న, ఎస్ ఓంకారి, మహిళా సంఘ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అనంతపురం : నగరంలోని 10వ డివిజన్ లోని పాతవూరు, ఫెర్రర్ రూముల వద్ద మహిళలు ఫెర్రర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పోతుల రాజేశ్వరి, భావన, వెంకటలక్ష్మి, అమ్మయ్య, పెద్దక్క, మంజుల, కవిత, మున్నీ, ఉమాదేవి, సుజాత, జుబేదా, చంద్రకళ, శాంతమ్మ, జానకి తదితరులు పాల్గొన్నారు.

నార్పల : ఆర్‌డిటి వ్యవస్థాపకులు ఫాదర్ ఫెర్రర్ 103వ జయంతిని నాయనపల్లి గ్రామంలో బిహెచ్‌పిఎస్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఫెర్రర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కరువు నేలపై విద్యాభివృద్ధికి, వైద్య సహాయానికి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి తోడ్పడిన అమృతమూర్తి ఫెర్రర్ అని కొనియాడారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్న వారసులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జయరాం, శివయ్య, సూర్యనారాయణరెడ్డి, రమణయ్య, రామకృష్ణ, గంగయ్య, ప్రసాద్, వీరప్ప, రామాంజనేయులు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



అరకటివేములలో ఫెర్రర్ జయంతి వేడుకులు

బెలుగుప్ప : స్థానిక ఎస్సీ కాలనీలో ఫెర్రర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఫెర్రర్ చిత్రపటాన్ని పురవీధుల గుండా ఊరేగించారు ఆర్‌డిటి చేపట్టిన స్పందించి సహాయం అందించు కార్యక్రమానికి మండలానికి చెందిన పెద్ద తిప్పయ్య, మల్లికార్జున రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ముత్తన్న, ఎస్సీ కాలనీవాసులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : స్థానిక ఆర్‌డిటి స్కూల్ ఆవరణలో ఫెర్రర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఫెర్రర్ చేసిన సేవలను కొనియాడారు. అనంతరం మహిళలు డప్పులతో అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు.

పుట్లూరు : అరకటివేముల గ్రామంలో విన్సెంట్ ఫెర్రర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆర్‌డిటి స్కూల్లో ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ నాలెడ్జ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఆర్‌డిటి డైరెక్టర్ బి.రాజశేఖర్‌రెడ్డి, రీజినల్ డైరెక్టర్ నారాయణరెడ్డి, ఎటిఎల్ సుశీలమ్మ, సర్పంచి బొమ్మొళ్ల ఏసమ్మ, ఉప సర్పంచి లొడుగు లక్ష్మీనారాయణమ్మ, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్ బొమ్మొళ్ల శ్రీనివాసులు, వైస్ ఛైర్‌పర్సన్ బడేంకటి కుల్లాయమ్మ పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : ఆర్డీటీ వ్యవస్థాపకులు, పేద,బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి ఫాదర్ ఫెర్రర్ అని తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి అన్నారు. ఆదివారం ఫెర్రర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆర్జీ శివశంకర్, రామాంజినేయులు, రమేష్, గోపి, లక్ష్మినారాయణ, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్ జోరు..!

ఐపిఎల్‌తో మొదలైన పందేల పర్వం

ఆర్థికంగా నష్టపోతున్న యువత

ప్రజాశక్తి-ఆత్మకూరు

'నా కొడుకు ఇంటర్ వరకూ బుద్ధిగా ఉండేవాడు. ఆ తర్వాత ఇంట్లో మెల్లగా డబ్బు తీసుకెళ్లడం ప్రారంభించాడు. బయట కూడా దాదాపు రూ.లక్ష వరకూ అప్పు చేశాడు. మేం ఆర్థికంగా క్షీణించి వీధిన పడాల్సి వచ్చింది. చివరికి తెలిసింది క్రికెట్ బెట్టింగ్‌లో మొత్తం పోగొట్టుకున్నాడని'.. ఇదీ ఓ తల్లి ఆవేదన. ఆ తల్లి మాత్రమే కాదు. క్రికెట్ బెట్టింగ్‌కు బానిసలై అప్పుల పాలవుతున్న యువకుల తల్లిదండ్రులందరి ఆవేదనా ఇదే..

ఐపిఎల్ సీజన్ వచ్చిందంటే యువతలో జోరు అంతా.. ఇంతా కాదు. ఆ జోరును బెట్టింగ్ బుకీలు క్యాష్ చేసుకుంటున్నారు. మ్యాచ్‌లో సాగే బంతి బంతికీ పందేలు కాస్తున్నారు. ప్రస్తుతం ఐపిఎల్ ప్రారంభం రోజున కొన్ని ప్రాంతాల్లో మాత్రమే మొదలైన క్రికెట్ బెట్టింగ్ ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లోనూ ఊపందుకుంది. తొలుత క్రికెట్ అంటే మానసికోల్లాసం కోసం, క్రీడా స్ఫూర్తి కోసమే ఆడేవారు. నేడు అది జూద క్రీడగానూ మారిపోయింది. గతంలో పట్టణాలకే పరిమితమైన 'బెట్టింగ్ ఫీవర్' నేడు మండల కేంద్రాలతో పాటు మారుమూల గ్రామాలకూ విస్తరించింది.

ఆత్మకూరు మండలంలోనూ ఈ బెట్టింగ్ ఫీవర్ తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగిస్తోంది. వ్యవహారమంతా సెల్‌ఫోన్ల లోనూ, ఆన్‌లైన్ల లోనే సాగుతోంది. ప్రత్యేకంగా సెల్‌ఫోన్లు కొనుగోలు చేసుకుని తమ పేర్లతో లేని సిమ్ కార్డులను యువత బెట్టింగ్ కోసం వినియోగిస్తున్నారు. రూ.100 కాస్తే రూ.150, రూ.200 ఇస్తామంటూ బుకీలు ఆశ చూపి యువతను బెట్టింగ్ ఊబిలోకి లాగుతున్నారు. దాంతో యువత బెట్టింగ్‌లో బిజీబిజీ అయిపోయారు. మ్యాచ్ మొదలవడానికి రెండు, మూడు గంటల ముందే వాట్సప్, మెసేజ్, ఫోన్ కాల్స్, ఇంటర్నెట్‌లో యువత బెట్టింగ్‌ను హోరెత్తిస్తున్నారు. చివరికి సర్వం కోల్పోయి వీధిన పడుతున్నారు పోలీస్ అధికారులు స్పందించి క్రికెట్ బెట్టింగ్ వాళ్లను కట్టడి చేయాలని పలువురు తల్లిదండ్రుల విజ్ఞప్తి చేస్తున్నారు.

నారా లోకేష్‌కు ఘన స్వాగతం



పాదయాత్రలో పాల్గొన్న డేగల కృష్ణమూర్తి

శింగనమల : యువగళం పాదయాత్ర చేస్తున్న నారా లోకేష్‌కు అనంతపురం తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి, గుమ్మేపల్లి సర్పంచి డేగల లలితమ్మ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. నారా లోకేష్ 65వ రోజు పాదయాత్ర జంబులదిన్నె క్రాస్ నుంచి ఆదివారం శింగనమల మండలంలోకి ప్రవేశించింది. నారా లోకేష్‌కు డేగల కృష్ణమూర్తి, గుమ్మేపల్లి సర్పంచి డేగల లలితమ్మ గజమాలతో స్వాగతం పలికారు. మహిళలు లోకేష్‌కు మంగళ హారతులు ఇచ్చి పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. నియోజకవర్గ టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐదోరోజుకు చేరిన రిలేదీక్షలు

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్‌ని వెంటనే ప్రారంభించాలని, కిడ్నీ రోగులకు డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలని తదితర సమస్యలతో పాటు పట్టణ శివారు ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలని సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం నాటికి ఐదవ రోజుకు చేరాయి. సిపిఎం దీక్షలకు మద్దతుగా పట్టణ ఆవాజ్ కమిటీ నాయకులు షేక్ అబ్దుల్లా, మస్తాన్ వలి, ఎస్‌కెఎం బాషా, షాషావలి, కమిటీ సభ్యులు దీక్షలు చేపట్టారు.

ప్రజల ఆరోగ్యానికి రక్షణ కవచం హోమియో

హానికరం లేని వైద్య విధానం

నేడు ప్రపంచ హోమియో దినోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం

అవసరం వల్ల రోగికి స్వస్థత చేకూరాలే తప్ప మందుల దుష్ప్రభావంతో మరెన్నో కొత్త సమస్యలు రాకూడదు. అలాంటి పురాతన వైద్య విధానమే హోమియో చికిత్స. క్రిస్టియన్ ఫెడరిక్ శామ్యూల్ హనేమాన్ హోమియోపతి వైద్య విధానాన్ని కనుగొన్నారు. తనపై, తన కుటుంబ సభ్యులపై 100కు పైగా పరిశోధనలు, ప్రయోగాలను విజయవంతం చేసిన తత్వవేత్త. ఆయన కనిపెట్టిన మందులను చిన్నపిల్లలు మొదలుకొని వద్ధులు దాకా ఎంతో నమ్మకంతో వాడుతున్నారు. ఆయన జయంతి రోజైన ఏప్రిల్ 10వ తేదీ ప్రపంచవ్యాప్తంగా హోమియోపతి దినోత్సవంగా జరుపుకుంటారు. ఈ క్రమంలో జిల్లాలో హోమియో వైద్య విధానానికి లభిస్తున్న ప్రజాధరణ ప్రభుత్వ ప్రోత్సాహం తదితర అంశాలపై నేటి కథనం..

హోమియోను దేశీయ వైద్యంగా భావిస్తారు. దీర్ఘకాలిక వ్యాధులే కాదు కాలానుగుణంగా వచ్చే జబ్బులకు సైతం నాణ్యతగా పనిచేసే వైద్యం ఇది. అల్లోపతి వైద్యంతో నయం కాని జబ్బులు సైతం హోమియోలో స్వస్థత చేకూరిందంటే అతిశయోక్తి కాదేమో. ఏటా సీజనల్‌గా జనాన్ని ముప్పతిప్పలు పెట్టే మెదడువాపు, స్వైన్ ఫ్లూ, డెంగీ, చికున్ గునియా, చికెన్ ఫాక్స్, కండ్ల కలక, విష జ్వరాలు ఇలా ఎన్నో రకాల రోగాలు సోకకుండా హోమియో మందు ముందస్తు రక్షణ కల్పిస్తుంది. 1998లో జిల్లాను వణికించిన మెదడువాపు మహమ్మారిని అదుపు చేసింది హోమియో వైద్యమే. అప్పట్లో 20,047 మంది చిన్నారులకు ఆ జబ్బు సోకితే 47 మంది మృత్యువాత పడ్డారు. పసిపిల్లల ప్రాణాలకు రక్షణ కవచంగా నిలిచింది హోమియో. బెల్లడోనా అనే పిల్ ప్రతి పిల్లాడికి వేశారు. ఆ తర్వాత 2015లో డెంగీ 2016లో స్వైన్ ఫ్లూ వంటి ప్రమాదకర జ్వరాలను అల్లోపతి అదుపు చేయలేకపోయినా హోమియో అడ్డుకట్ట వేసింది. జిల్లాలో విరివిగా మింగించారు. దీంతో ప్రజలకు నమ్మకం భరోసా లభించింది ఈ ఔషధంతో ఎలాంటి హానికర దుష్ప్రభావాలు ఉండవు. జిల్లాలో 25 ప్రభుత్వ హోమియో వైద్యశాలలు ఉన్నాయి. ఇందులో 12 రెగ్యులర్, 13 జాతీయ ఆరోగ్య మిషన్ సారధ్యంలో నడుస్తున్నాయి. అనంతపురం, గుత్తి, తాడిపత్రి, పుట్టపర్తి, ముంటిమడుగు, రాయదుర్గం, బెలుగుప్ప, తలుపుల, కళ్ల మర్రి, బికె.సముద్రం, కుందుర్పి, కొనకొండ్ల, దేవనహళ్లి, కొత్తచెరువు, పెనుకొండ, ఎన్‌పి.కుంట, అమడగూరు, కదిరి, బేతేపల్లి, ఎద్దులపల్లి, కనేకల్లు, పట్నం ఆత్మకూరులో వైద్యశాలలు ఉన్నాయి.

హానికరం లేని వైద్యం

డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు

హోమియోపతి వైద్యం ప్రజల వైద్యం. నమ్మకానికి అమ్మ వంటిది. హోమియో వైద్యం ఎంతో ఉపయోగం. తాత్కాలిక, దీర్ఘకాలిక రోగాలకు వంద శాతం నయం చేసే ఔషధ గుణం కలిగిన వైద్యమిది. అన్ని రకాల వ్యాధులకు హోమియోపతిలో మందులు ఉన్నాయి. హోమియో మందులను ఎటువంటి దుష్ప్రభావం లేకుండా ధైర్యంగా వాడవచ్చును. అల్లోపతి మందులు తింటూనే హోమియోపతి మందులు కూడా వాడవచ్చు. ప్రభుత్వం అన్ని రకాలుగా హోమియోపతి వైద్యశాలల్లో మందులను అందుబాటులో ఉంచింది. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆరోగ్యకరమైన జీవితం పొందవచ్చు.



డాక్టరు నల్లపాటి తిరుపతి నాయుడు

పాత ప్రాజెక్టుల నష్టాన్ని నివారించండి

ప్రజాశక్తి-తాడిపత్రి

కొత్త ప్రాజెక్టుల కథ దేవుడెరుగు.. తుంగభద్ర ప్రాజెక్టులో పూడికతో నష్టపోతున్న 30 టిఎమ్‌సిల నీరు, శ్రీశైలం ప్రాజెక్టులో పూడికతో నష్టపోతున్న 100 టిఎంసిల నీరు, పట్టిసీమ ద్వారా ఆదా అయ్యే శ్రీశైలం ప్రాజెక్టులోని మన వాటా నీరు రాయలసీమ ప్రాంతానికి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సాధించడానికి పార్టీలకతీతంగా సీమ ప్రాంత నాయకులు చొరవ చూపాలని రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ నాయకులు తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డి రాజకీయ నాయకులను డిమాండ్ చేశారు. రాయలసీమ ప్రజలు చేతగాని, చేవలేని ప్రభుత్వాలకు, నాయకులకు, పార్టీలకు అమాయకంగా బ్రహ్మరథం పడుతున్నారన్నారు. అనుమతి లేని ఎత్తిపోతల పథకాలు తెచ్చి రాయలసీమ ప్రాంతంలో కరువును జయించామని చెబుతూ ఈ ప్రాంత ప్రజలను బ్రమలోకి నెట్టుతూ రాజకీయ నాయకులు పబ్బం గడుపుకుంటున్నారన్నారు. వారికి రాయలసీమ తల్లి గర్భ శోకం కనబడటం లేదన్నారు. ఈ ప్రాంత రాజకీయ నాయకులకు తుంగభద్ర సమాంతర కాలువ కట్టాలని అనిపించడం లేదన్నారు. ఆలమట్టి నుండి బుక్కపట్నం వరకు వరద కాలువ ద్వారా పై భాగంలో క్రిష్ణా, తుంగభద్ర, పెన్నా, చిత్రావతి నదులను అనుసంధానం చేయాలని అనిపించడం లేదన్నారు. గుండ్రేవుల, ఆర్‌డిఎస్ ప్రాజెక్టులను కట్టాలన్న ధ్యాస లేదన్నారు. క్రిష్ణా నదిపై సిద్ధేశ్వరం దగ్గర ఐకానిక్ బ్రిడ్జ్ బదులుగా బ్రిడ్జ్ కమ్ బ్యారేజీని నిర్మించాలని అనిపించడం లేదన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పుల వల్లనే ఈ పరిస్థితి అని అధికారంలో ఉన్నవారు బుకాయించడం సిగ్గుచేటు అన్నారు. వీరి తీరును అవకాశంగా మలుచుకున్న బిజెపి ప్రభుత్వం కర్నాటకలోని అప్పర్ భద్ర ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిందన్నారు. వీటన్నింటిని ప్రజలు గమనించి రాయలసీమ ద్రోహులకు సహకరించకుండా ప్రత్యేక రాయలసీమ రాష్ట్ర డిమాండ్ కోసం మాతో కలిసి రావాలని పిలుపునిచ్చారు.

నేరాలు ఘోరాలు

మిడుతూరులో చోరీ

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

పెద్దవడుగూరు మండలం మిడుతూరు గ్రామంలో రామ్మోహన్‌రెడ్డి, శ్రీలతకు చెందిన ఇళ్లలో శనివారం రాత్రి దొంగలు చొరబడి బంగారు ఆభరణాలు, నగదును దోచుకెళ్లినట్లు ఎస్ఐ రాజశేఖరరెడ్డి తెలిపారు. రాత్రి వేళ కుటుంబ సభ్యులు ఇంటిపై నిద్రిస్తున్న విషయాన్ని గమనించిన దొంగలు తాళాలను పగులగొట్టి ఇళ్లలోకి ప్రవేశిలంచారు. రామ్మోహన్‌రెడ్డి ఇంటిలోని బీరువాలో ఉన్న నాలుగు తులాల బంగారు ఆభరణాలు, రూ.2 వేలు నగదు, శ్రీలత ఇంట్లో ఒక తులం బంగారు దోచుకెళ్లినట్లు చెప్పారు. తెల్లవారుజామున తలుపులు తెరచి ఉండడాన్ని చూసి లోపలికి వెళ్లి పరిశీలించారు. దొంగలు చొరబడినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-పుట్లూరు

పుట్లూరు మండల పరిధిలోని చాలవేముల గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం రావడంతో ఎస్ఐ వెంకటప్రసాద్ తన సిబ్బందితో కలిసి ఆదివారం దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ.2,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశారు.

విద్యుత్ తీగలు తెగపడి రెండు పశువులు మృతి

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ మండలం నెరమెట్ల గ్రామంలో విద్యుత్ తీగలు తెగిపడడంతో గ్రామానికి చెందిన మంగలి గోపాల్ అనే వ్యక్తికి చెందిన రెండు పాలిచ్చే పశువులు ఆదివారం విద్యుత్ షాక్ గురై మృత్యువాత పడ్డాయి. పాలిచ్చే ఎనుములను నమ్ముకుని గోపాల్ తమ కుటుంబ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. రెండు ఎనుములు మృత్యువాత పడడంతో వారి కుటుంబం జీవనోపాధిని కోల్పోయింది. వాటి విలువ రూ.లక్ష వరకు ఉంటుందని బాధితులు తెలిపారు. తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. సర్పంచి యోగేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ సంఘటన జరిగిందన్నారు. గతంలో కూడా ఇలాంటి సంఘటనలు జరిగాయన్నారు. ఏడు నెలలుగా తమ గ్రామానికి లైన్‌మేన్ లేరని తెలిపారు. పరిహారం అందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

కోచ్ రవీంద్రను శిక్షించండి

ప్రజాశక్తి-అనంతపురం

స్పోర్ట్స్ క్రీడాకారులను ఇబ్బందులకు గురిచేస్తున్న ఫెన్సింగ్ కోచ్ రవీంద్రను తక్షణమే సస్పెండ్ చేయాలని ఎఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుల్లాయస్వామి, జి.చిరంజీవి డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ క్రీడాభివద్ధి సంస్థకు చెందిన ఖేలో ఇండియా ఫెన్సింగ్ కోచ్ రవీంద్ర వేధింపులు, అనైతిక కార్యకలాపాలు, అక్రమాల వల్ల అనంతపురం ఫెన్సింగ్ క్రీడాకారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వారి శిక్షణకు ఎంతో నష్టం జరిగిందన్నారు. శిక్షణ పొందుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు కలెక్టర్‌కు, ఎండీకి వినతిపత్రం అందజేసినా అతనిపై చర్యలు తీసుకోకుండా ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే అతన్ని సస్పెండ్ చేయాలని, కొత్త కోచ్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాల చేపడతామని హెచ్చరించారు.

17న సిఎం జగన్ నార్పలకు రాక..?

సభా స్థల ఏర్పాట్లను పరిశీలించిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి-నార్పల

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వసతి దీవెన పథకాన్ని ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఈనెల 17వ తేదీ నార్పల మండల కేంద్రానికి రానున్నట్లు స్థానిక వైసిపి నాయకులు తెలిపారు. ఆదివారం స్థానిక వైసిపి నాయకులు సత్యనారాయణరెడ్డి, తహశీల్దారు నారాయణస్వామి, ఆర్ఐ సందీప్ క్రాసింగ్, సుల్తాన్‌పేటలో సభా స్థలాన్ని పరిశీలించారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక మొదటి సారిగా శింగనమల నియోజకవర్గానికి వస్తుండడంతో ఆయన పర్యటనను విజయవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి స్థానిక వైసిపి నాయకులతో చర్చించినట్లు సమాచారం. ముఖ్యమంత్రి వస్తున్నట్లు అధికారికంగా ప్రకటన విడుదల కాలేదు.

ఆత్మకూరుకు తహాశీల్దార్‌ను నియమించండి

ప్రజాశక్తి-ఆత్మకూరు

ఆత్మకూరు మండలానికి తహశీల్దారును నియమించాలని సిపిఎం మండల కార్యదర్శి శివశంకర్ డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న తహశీల్దారు నాగభూషణం అనారోగ్య కారణాల రీత్యా రెండు నెలల పాటు సెలవుపై వెళ్లారన్నారు. దీంతో వివిధ పనుల మీద తహశీల్దారు కార్యాలయానికి వచ్చే మండల ప్రజలు పనులు జరగక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఆత్మకూరు మండలానికి వెంటనే తహశీల్దారును నియమించాలని కోరారు.

ప్రహరీ నిర్మించండి

ప్రజాశక్తి-శెట్టూరు

శెట్టూరు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలకు ప్రహరీని నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రహరీ కూలి సంవత్సరాలు గడుస్తున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదన్నారు. ప్రహరీ లేకపోవడంతో విద్యార్థినులు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. నిధులు మంజూరైనా ప్రహరీ నిర్మాణం చేపట్టలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని కోరుతున్నారు. ఈ విషయమై పాఠశాల ఎస్ఓను వివరణ కోరగా నిధులు వచ్చాయని, త్వరలోనే ప్రహరీ నిర్మిస్తామని చెప్పారు.

ఎమ్మెల్యేల అవినీతిని కట్టడిచేయడంలో జగన్ విఫలం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్

ప్రజాశక్తి-గుంతకల్లు

అధికార పార్టీ ఎమ్మెల్యేల అవినీతి, అక్రమాలను కట్టడి చేయడంలో సిఎం జగన్‌రెడ్డి పూర్తిగా విఫలం అయ్యారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీష్ విమర్శించారు. ఆదివారం పట్టణంలోని బిటి.పక్కీరప్ప భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ ఎమ్మెల్యేల అవినీతి, అక్రమాలు,భూ కబ్జాలు పెచ్చుమీరి పోయాయన్నారు. వాటిని కట్టడి చేయడంలో సిఎం జగన్‌రెడ్డి పూర్తిగా విఫలం అయ్యారన్నారు. లోకేష్ పాదయాత్రలో వైసీపీ ఎమ్మెల్యేల అవినీతి భాగోతాలను క్లుప్తంగా ప్రజలకు వివరిస్తున్నందున ఆదరణ లభిస్తోందన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా మద్యం, భూ మాఫియాలు, ఇసుక, మట్టి మాఫియాలుగా అధికార పార్టీ వారు తయ్యారన్నారు. ఇంత అప్రజాస్వామ్యంగా, నియంతృత్వంగా గతంలో ఏ ప్రభుత్వం లేదన్నారు. కడప జిల్లాలో ఒక దళిత అధికారి డాక్టర్ అచ్చన్న హత్య కేసుపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ నిరసన తెలిపితే అక్రమ అరెస్టులు చేయించడం దుర్మార్గం అన్నారు. ప్రజా సమస్యలపై నిరసన దీక్షలు, ధర్నాలకు ఈ ప్రభుత్వం అనుమతించడం లేదన్నారు. ప్రజా సమస్యలపై చలో విజయవాడకు 11వ తేదీన దళిత సంఘాలు, సిపిఐ పిలుపునిస్తే అక్కడికి వెళ్లకుండా అడ్డుకొని గృహ నిర్బంధం, అరెస్టులు, అడ్డుకోడానికి సన్నాహాలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రజాస్వామ్యం బద్ధంగా పనిచేస్తూ దౌర్జన్యాలకు అరాచకాలకు స్వస్తి పలకాలని హితువు పలికారు. ఏప్రిల్ 14 నుండి 30వ తేదీ వరకు మోడీ హటావో దేశ్‌కి బచావో, జగన్ హటావో ఏపీకి బచావో ప్రచార ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.గోవిందు, నియోజవర్గం కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి బి.మహేష్, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, మండల కార్యదర్శి రాము రాయల్, పట్టణ సహాయ కార్యదర్శి గౌస్ తదితరులు పాల్గొన్నారు.